సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 29 । నవంబర్ । 2024



చెకుముకి సైన్స్ పోటీలు

దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

- 8లో ▸



రైతు సంక్షేమమే లక్ష్యం

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.3 /10.4

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బయట పడుతున్న ఎమ్మెల్యే అక్రమాలు

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అవినీతి, అక్రమాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే బయట పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. గురువారం ఆయన బిచ్కుందలో మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ల పదవులు ఇవ్వడానికి ఎమ్మెల్యే రూ.లక్షలు డిమాండ్ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే గాంధీ భవన్‌లో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. లక్ష్మీకాంతారావు ఫేక్ ఎస్సీ సర్టిఫికెట్‌తో ఎన్నికల్లో పోటీ చేశారని సింధే ఆరోపించారు. ఎమ్మెల్యే స్కూల్, కళాశాలల రికార్డులు, సర్టిఫికెట్లలో బీసీ అని ఉందన్నారు. దీనిపై జనవరిలో అన్ని ఆధారాలతో కోర్టులో పిటిషన్ వేసినట్లు చెప్పారు. శుక్రవారం కామారెడ్డిలో నిర్వహించే దీక్ష దివస్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వెంకట్‌రావు, బాలాజీ, సంజీవ్ పటేల్, మైపత్ హన్మాండ్లు, రాంచందర్, మహేష్, బీ లక్ష్మణ్, డాక్టర్ రాజు, పవన్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసం కెపాసిటర్ బ్యాంకులు



కామారెడ్డి అర్బన్: జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి సుమారు రూ.రెండు కోట్ల వ్యయంతో తొమ్మిది సబ్‌స్టేషన్లలో కెపాసిటర్ బ్యాంక్‌లను ఏర్పాటు చేసినట్టు ఎస్ఈ నీల శ్రావణ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని ఇసాయిపేట, ఫరీద్‌పేట, దోమకొండ, జంగంపల్లి, లింగంపేట్, సర్వాపూర్, పిట్లం, బిచ్కుంద, అచ్చయపేట్ 33కేవీ సబ్‌స్టేషన్లలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేశామన్నారు. వీటితో లో ఓల్టేజీ సమస్యలు రాకుండా నాణ్యమైన విద్యుత్ అందుతుందని, సరఫరా అంతరాయాలు తగ్గుతాయని పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

దోమకొండ: మహిళా సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. గురువారం దోమకొండ మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా శక్తి క్యాంటీన్ భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధాకర్, రమేష్ బాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద మండలం చిన్నదడ్గి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు.. ఇన్‌సెట్‌లో నీళ్లచారులా ఉన్న కూర



రుచించని భోజనం!

- చాలా చోట్ల నీళ్ల చారు.. మెరిగల అన్నం
- అరకొరగా ఆకుకూరలు, కూరగాయల వాడకం
- మధ్యాహ్న భోజనం తినడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉంటోంది. నాసిరకం కూరగాయలు, సరుకులతో వంటలు చేస్తుండటంతో విద్యార్థులు తినలేకపోతున్నారు. రుచి పచి లేని భోజనం తినలేక అర్ధాకలితో పాఠాలు వింటున్నారు. మరికొందరు ఇంటి నుంచి భోజనం, కర్రీలు తెచ్చుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అధ్వానంగా ఉంటోంది. చాలా చోట్ల అన్నం, కూరల్లో నాణ్యత కొరవడింది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ఊళ్లల్లో అయితే ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. కూరలు వండడానికి కూరగాయలు, ఆకు కూరలు నామమాత్రంగా వాడుతున్నారు. కూరలు నీళ్లచారులా ఉంటున్నాయని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో మధ్యాహ్న భోజనం అమలుతీరుపై 'సాక్షి' విజిట్ నిర్వహించింది. కొన్ని చోట్ల మాత్రమే మెనూ అమలవుతుండగా, చాలా చోట్ల ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో తినడానికి రుచించడం లేదు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులకు సరిగా బిల్లులు రాకపోవడం, నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగడం కూడా కారణంగా చెబుతున్నారు. జిల్లాలో మధ్యాహ్న భోజనం అమలవుతున్న పాఠశాలలు 986 ఉండగా, 73,930 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే చాల బడుల్లో భోజనం నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్న భోజనం వండడానికి షెడ్‌లు లేకపోవడంతో చాలా చోట్ల చెట్ల కింద కట్టెల పొయ్యిల మీదనే వండుతున్నారు. మరికొన్ని చోట్ల నీళ్లకూ సమస్య ఉంది. ఇళ్ల నుంచే వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కస్తూర్బాల మీద దృష్టి పెట్టినట్టే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై కలెక్టర్ దృష్టి సారిస్తే మెరుగయ్యే అవకాశం ఉంది.

సాక్షి ఫోకస్ SAKSHI FOCUS



కళ్యాణి ఉన్నత పాఠశాలలో నీరు లేకపోవడంతో బయట ప్లేట్లు కడుక్కుంటున్న విద్యార్థులు

మెనూ కాగితాలకే పరిమితం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన మెనూ ఎక్కడా అమలు కావడం లేదు. సోమవారం అన్నం, కూరగాయల కరీ, ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. మంగళవారం అన్నం, ఆకుకూరలతో కూడిన పప్పు, బుధవారం అన్నం, గుడ్డు, కూరగాయల కరీ, గురువారం అన్నం, కూరగాయలతో సాంబార్, శుక్రవారం అన్నం, గుడ్డు, చిక్కుడులతో కూడిన కరీ, శనివారం వెజిటేబుల్ బిర్యానీ లేదా మరేదైనా ఆహారం ఇవ్వాలి. అయితే చాలా స్కూళ్లలో అవసరానికి సరిపడా కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేయడం లేదు. పెరిగిన కూరగాయలు, ఆకుకూరల ధరలతో వంట ఏజెన్సీలకు గిట్టుబాటు కాదని చెప్పి అరకొరగా తెచ్చి వండుతున్నారు. అలాగే వారినికి మూడు కోడి గుడ్లు ఇవ్వాల్సి ఉండగా, దాదాపు అంతటా రెండు మాత్రమే ఇస్తున్నారు.

ఇంటి నుంచి బాక్సులు

కొన్ని స్కూళ్లలో బియ్యాన్ని చెరగడం లేదు. ఉన్నది ఉన్నట్టుగానే పొయ్యిమీద వేసేస్తున్నారు. దీంతో అన్నంలో మెరిగలతో పాటు మట్టిపెళ్లలు వస్తున్నాయి. అలాగే ముక్కిపోయిన బియ్యంలో పురుగులు కూడా వస్తున్నాయి. ఒక్కోసారి అన్నం కూడా ముద్దగా మారుతుందని విద్యార్థులు చెబుతున్నారు. చాలా స్కూళ్లలో పప్పుచారు పోస్తున్నారు. కొన్ని చోట్ల కూరగాయలు, ఆకు కూరలు ఉడికించి పలచగా చేసి పెడుతున్నారు. నీళ్ల చారైనా అందులో ఇతర దినుసులు వేయకపోవడంతో విద్యార్థులు తినలేకపోతున్నారు. భోజనం రుచికరంగా ఉండటం లేదని కొందరు విద్యార్థులు ఇళ్లనుంచే బాక్సులు తెచ్చుకుంటున్నారు. తాడ్వాయి మండలం నందివాడ ప్రాథమిక పాఠశాలలో కొందరు పిల్లలు ఇంటి నుంచే కర్రీ తెచ్చుకుంటున్నారు.

మధ్యాహ్న భోజనమే లేదు

తాడ్వాయి మండలం నందివాడ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నడవక చాలా రోజులైంది. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. నాగిరెడ్డిపేట మండలం లింగంపల్లి, జప్తి జాన్కంపల్లి, ఎర్రారం గ్రామాల్లోని యూపీఎస్‌లలో కొంత కాలంగా మధ్యాహ్న భోజనం లేక ఇళ్లకు వెళ్లి భోజనం తిని వస్తున్నారు. జిల్లాలో మరికొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నడవడం లేదని తెలుస్తోంది. రికార్డుల్లో మాత్రం అంతటా కొనసాగుతున్నట్లు పేర్కొంటున్నారు.

జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులు

కేటగిరి	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	662	29,425
ఉచ్చతర ప్రాథమిక	127	9,076
ఉన్నత	197	35,429



నందివాడ ప్రాథమిక పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థినులు

చిన్నారిని మింగిన డ్రైనేజీ



ధనశ్రీ(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణం 35వ వార్డు పరిధిలోని రాంనగర్‌లో ఏడు ఫీట్ల లోతైన డ్రైనేజీలో పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. రాంనగర్‌లో నివసిస్తున్న ఆటో డ్రైవర్ మట్ట ప్రశాంత్, జ్యోతి దంపతుల కూతురు ధనశ్రీ గురువారం ఉదయం ఇంటిముందు ఆడుకుంటూ డ్రైనేజీలో పడిపోయింది. పాప కనపడక పోయేసరికి కుటుంబ సభ్యులు కాలనీ మొత్తం వెతికారు. చివరకు కాలనీవాసులు డ్రైనేజీలో బుడగలు వస్తుండడం గమనించి వెతకగా చిన్నారి మృతదేహం లభ్యమైంది. ఉన్నఫలంగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందిందని వైద్యులు తెలిపారు. పెళ్లయిన 12 సంవత్సరాలకు జన్మించిన ఏకైక సంతానం ధనశ్రీ మృతితో దంపతుల రోదనలు మిన్నంటాయి. ఘటనా స్థలానికి వచ్చిన మున్సిపల్ అధికారులతో కాలనీవాసులు వాగ్వాదం పెట్టుకున్నారు. కాలనీలో ప్రమాదకరంగా మారిన డ్రైనేజీపై రక్షణ చర్యలు చేపట్టాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పెడచెవిన పెట్టారని ఆరోపించారు. చిన్నారి మృతికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. డ్రైనేజీ వద్ద వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

టీచర్లు రుచి చూశాకే పిల్లలకు భోజనం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్రంలో ఇటీవల ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలు మొదలు స్కూళ్లు, హాస్టళ్లు, గురుకులాల్లో ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలో హెడ్మాస్టర్, హాస్టల్‌లో వార్డెన్, అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, గురుకులాల్లో ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందితో కమిటీ ఏర్పాటు చేయాలని పేర్కొంది. కమిటీ సభ్యులు తిన్న తర్వాతే పిల్లలకు ఆహారం అందించాలని ఆదేశించింది. ప్రతీ రోజూ వంట చేసే ముందు స్టోర్ రూం, కిచెన్‌లను పరిశీలించాలని పేర్కొంది.

దీక్షా దివస్‌కు గులాబీ దండు రెడీ!

- నేడు జిల్లా కేంద్రంలో సభ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దీక్షకు కూర్చుని రాష్ట్రాన్ని సాధించిన నేపథ్యాన్ని ఆ పార్టీ దీక్షా దివస్‌గా పేర్కొంటూ శుక్రవారం జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పట్టణంలోని సత్య కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఉద్యమ నేపథ్యానికి సంబంధించి ఫొటోల ప్రదర్శన కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీక్షా దివస్ ఇన్‌చార్జీగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరుకానున్నారు. మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్‌సింధే, జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ తదితరులు హాజరుకానున్నారు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరయ్యేలా నేతలు ఏర్పాట్లు చేశారు.

రెచ్చిపోతున్న దొంగలు



ఎల్లారెడ్డిలో చోరీ జరిగిన దుకాణాలను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
- వరుస చోరీలతో ఆందోళన చెందుతున్న ప్రజలు

కామారెడ్డి క్రైం: ఉమ్మడి జిల్లా పరిధిలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్నారు. గడిచిన పది రోజుల వ్యవధిలోనే ఉమ్మడి జిల్లా పరిధిలో పలు వరుస చోరీ ఘటనలు వెలుగు చూశాయి. దీంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముహూర్తాలు ఉండటంతో పది రోజులుగా శుభకార్యాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. దీంతో బంధువుల ఇళ్లలో శుభకార్యాలకు హాజరు కావడానికి చాలా మంది ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా వెళ్తున్నారు. ఇదే అదనుగా దొంగలు కాలనీల్లో రెక్కి నిర్వహిస్తూ తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఇటీవల జరిగిన చోరీలు

మూడు రోజుల క్రితం కామారెడ్డిలోని అశోక్ నగర్ కాలనీలోని రెండు ఇళ్లలో దొంగలు పడి బంగారం, నగదు దోచుకెళ్లారు. అదే రోజున గురురాఘవేంద్ర కాలనీకి చెందిన ఓ ఇంట్లో చోరీ చేశారు. అంతకు రెండు రోజుల ముందు శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ప్రకాష్, బాలాగౌడ్ ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. వారం క్రితం ఆర్మూర్‌లో రెండు చోట్ల, కమ్మర్‌పల్లిలోని ఓ ఇంట్లో, నిజామాబాద్ 4వ టౌన్ పరిధిలోని ఓ ఇంట్లో దొంగతనాలు జరిగాయి. ఎల్లారెడ్డిలోని టీఎన్‌జీవోస్ కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాల్లో షట్టర్ల తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. ఇతర ప్రాంతాలకు చెందిన పాత నేరస్తులు ఇక్కడకు వచ్చి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది.

నిఘా కరువు..

జిల్లాలో కూలీల కొరత తీవ్రం కావడంతో పట్టణ ప్రాంతాల్లోని అనేక వ్యాపార రంగాల్లో బయట రాష్ట్రాలకు చెందిన కూలీలు వచ్చి పని చేస్తున్నారు. యూపీ, బిహార్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన కూలీల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుంది. వారంతా పట్టణాల్లోని శివారు ప్రాంతాలు, కాలనీల్లో నివాసం ఉంటున్నారు. ఖాళీ సమయాల్లో అన్ని చోట్ల కనిపిస్తుంటారు. దీంతో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా లోపిస్తుంది. ఎవరు సామాన్యులు, ఎవరు దొంగతనాలు చేయడానికి గస్తీ నిర్వహిస్తున్నవారో అర్థం కాని పరిస్థితి. పట్టణ ప్రాంతాల్లో బ్లూకోల్ట్ బృందాలు నిర్వహించే గస్తీ నామమాత్రంగానే సాగుతుందనే విమర్శలు ఉన్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

దొంగతనాలను అరికట్టడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి. గ్రామాలకు వెళ్లినప్పుడు ఇళ్లలో నగదు, బంగారం లాంటి విలువైన వస్తువులు ఉంచొద్దు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి

రైతుల వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోలు చేసిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లు, ట్యాబ్ ఎంట్రీలు, రైతులకు చెల్లింపులు తదితర అంశాలపై క్యాంపు కార్యాలయంలో గురువారం పౌరసరఫరాల అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కాంటా పూర్తి కాగానే ధాన్యాన్ని రైస్‌మిల్లలకు తరలించాలన్నారు. ఆ వెంటనే రైతుల, ధాన్యం వివరాలతో ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. వివరాలు నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వి విక్టర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, ఇన్‌చార్జి డీఎస్‌వో నరసింహారావు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

సమగ్ర సర్వే డేటా ఎంట్రీ వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమగ్ర సర్వే డేటా ఎంట్రీపై సమీక్షించారు. సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా పర్యవేక్షించాలన్నారు. వేగవంతంగా పూర్తి చేసేలా డేటా ఎంట్రీ ఆపరేటర్లను ప్రోత్సహించాలన్నారు. కామారెడ్డి మున్సిపల్‌కు సంబంధించిన డేటా ఎంట్రీ కోసం అవసరమైతే అదనంగా ఆపరేటర్‌లను నియమించుకోవాలన్నారు. సర్వేలో సేకరించిన సమాచారం ఫారాలను భద్రపరచాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ డీఈఈ వేణుగోపాల్, టీపీవో గిరిధర్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మరుగుదొడ్లు, స్కావెంజర్‌ల వివరాలు అందించండి

కామారెడ్డి క్రైం: జిల్లాలో పని చేస్తున్న స్కావెంజర్‌లు, మరుగుదొడ్ల వివరాలను డిసెంబర్ 5 లోగా సమర్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మున్సిపల్, పంచాయతీ, రైల్వే తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. స్కావెంజర్, ఇన్సానిటరీ టాయిలెట్స్ వివరాలు ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, మున్సిపల్ డిప్యూటీ ఈఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

7 నుంచి సీఎం కప్ క్రీడలు

కామారెడ్డి క్రైం: గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా స్థాయిలో సీఎం కప్- 2024 క్రీడలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సీఎం కప్ నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి పలు రకాల క్రీడల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 7 నుంచి 8 వరకు గ్రామపంచాయతీ స్థాయి క్రీడలు, 10 నుంచి 12 వరకు మండల, మున్సిపల్ స్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయి క్రీడలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 27 నుంచి జనవరి 2 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ సింధుశర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం



నిజాంసాగర్(జుక్కల్): ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం యువతను సిద్ధం చేస్తున్నామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన టీపీసీసీ సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికకు గ్రాడ్యుయేట్‌ల ఓటును చేర్పిస్తున్నామన్నారు.

జేసీబీ పట్టివేత



నస్రుల్లాబాద్: మండలంలోని బొప్పాస్‌పల్లి పరిధిలో ఉన్న అటవీ భూముల్లో మొరం తవ్వకాలు చేపడుతున్న జేసీబీని అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ నరేశ్, బీట్ ఆఫీసర్ రమాకాంత్ అడ్డుకున్నారు. దీంతో జేసీబీని బాన్సువాడ ఫారెస్టు ఆఫీసుకు తీసుకెళ్లకుండా మండల కేంద్రంలోని చెక్ పోస్టు వద్ద జేసీబీ సంబంధీకులు, బొప్పాస్‌పల్లి గ్రామస్తులు కొంత మంది అడ్డుకున్నారు. ప్రభుత్వ పనులకు అధికారులు మొరం అవసరం అనడంతోనే తమ స్వంత భూమిలో జేసీబీ నడుపుతున్నామని అటవీ శాఖ అధికారులతో వాగ్వాదం పెట్టుకున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు, ఎంపీడీవో అనుమతులతో మొరం తవ్వకాలు చేపట్టామన్నారు. జేసీబీని తీసుకెళ్లడానికి వీలు లేదంటూ వాదించారు. దీంతో అటవీ శాఖ అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో రెండు గంటల పాటు పోలీసులు సముదాయించారు. పోలీసులు జేసీబీని అదుపులోకి తీసుకుని సంబంధిత అధికారులతో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని తెలుపడంతో గొడవ సద్దుమణిగింది.

పాఠశాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆర్‌కే పబ్లిక్ పాఠశాలను గురువారం మండల విద్యాధికారి శౌకత్‌అలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులు, టాయిలెట్స్, రికార్డులు పరిశీలించారు. పాఠశాల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. యుడైస్ ప్రకారం పిల్లల సంఖ్య ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉంచాలన్నారు. సీఆర్పీ గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయులు మమత తదితరులున్నారు.

నిరసన దీక్షలను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 29, 30వ తేదిలలో చేపట్టే నిరసన దీక్షలను విజయవంతం చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రెండు రోజుల పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన దీక్షలను చేపట్టాలని, ప్రతీ ఉద్యోగి పాల్గొనాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి, విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సీఎం ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలన్నారు.

గుట్టుగా గుట్టలు స్వాహా..

- జిల్లావ్యాప్తంగా మొరం అక్రమ తరలింపు
- మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖకు కాసులు కురిపిస్తున్న మొరం దందా
- సిబ్బంది కొరత సాకుతో తనిఖీలను మరిచిన గనులశాఖ
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



జిల్లా కేంద్రంలోని నాగారం శివారులో చేపడుతున్న మొరం తవ్వకాలు(ఫైల్)

సుభాష్‌నగర్: జిల్లాలో మైనింగ్ మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వం లీజులకు అనుమతులు ఇవ్వకపోవడం అటు మాఫియాకు.. ఇటు అధికారులకు వరంగా మారుతోంది. మొరం తరలింపునకు దరఖాస్తులు పెట్టుకున్నా.. నెలల తరబడి వాటికి మోక్షం లభించక పోవడంతో నిబంధనల సాకు చూపుతూ వాటిని బుట్టదాఖలు చేస్తున్నారు. ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో గనుల శాఖ, మండలాల్లో రెవెన్యూ, పోలీసులను మచ్చిక చేసుకుని అక్రమ దందా నడిపిస్తున్నారు. మండలాల్లో మొరం దందా అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. వీటన్నింటిని లెక్కలేసుకుంటున్న మాఫియా వ్యాపారులు టిప్పర్ ధర రూ.4వేలకు అమాంతంగా పెంచేశారు.

జిల్లాలో ఏడు ప్రాంతాల్లో మొరం తరలింపునకు లీజులు (ఐదేళ్లు) మాత్రమే ఉన్నాయి. లీజుల్లో వివిధ కారణాలతో కేవలం మూడు మాత్రమే కొనసాగుతున్నాయి. అదేవిధంగా ప్రభుత్వ అవసరాలు, పనుల నిమిత్తం ఆర్మూర్, రెంజల్, డిచ్‌పల్లి మండలంలో టీపీలు (టెంపరరీ పర్మిట్) ఉన్నాయి. ప్రయివేటు కాంట్రాక్టర్లు, మొరం వ్యాపారులు టీపీల కోసం సుమారు 35 వరకు దరఖాస్తులు పెట్టుకున్నట్లు సమాచారం.

అడ్డుకట్ట వేసేదెవరు..?

జిల్లావ్యాప్తంగా మొరం అక్రమ దందాకు అడ్డుకట్ట వేయకపోగా,కాసుల కక్కుర్తికి మరిగిన రెవెన్యూ అధికారులు, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు నెలకు ఫలానా మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మొరం దందా కొనసాగించాలంటే ముందుగానే అధికారులకు ముడుపులు ముట్టజెప్పాల్సిందే. లేకుంటే తెలిసిన వెంటనే దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ముడుపులు అందితే అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ధర పెంచిన వ్యాపారులు

మొరం దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఒక్కో టిప్పర్ మొరం ధర కనీసం రూ.4000 నుంచి రూ.4500లకు (దూరం, డిమాండ్‌ను బట్టి) పెంచేశారు. ఏడాది క్రితం రూ.3వేల లోపే ఉన్న ధర ఎందుకు పెంచారని ప్రజలు అడిగితే అధికారులకు మామూళ్లు ఇవ్వాలని బహిరంగంగా చెప్పడం గమనార్హం.

టెండర్లు నిర్వహించాలి

మొరం లీజులు, టీపీలకు అనుమతులు ఇవ్వకపోవడంతో మాఫియా ఇష్టారీతిన గుట్టలను స్వాహా చేస్తోంది. మొరానికి జిల్లా వ్యాప్తంగా డిమాండ్ నెలకొంది. అక్రమంగా తరలించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లల్లో గండి పడుతోంది. మొరం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట పడాలంటే ప్రభుత్వమే మండలానికి రెండు చోట్ల టెండర్లు నిర్వహించాలి. లేకుంటే లీజులు, టీపీల కోసం పెట్టుకున్న దరఖాస్తులకు మోక్షం లభించాలి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపడితే మొరం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

చేతులెత్తేసిన మైనింగ్‌శాఖ

జిల్లాలో మొరం అక్రమ తరలింపును అదుపు చేయడంలో భూగర్భ గనులశాఖది కీలకపాత్ర. కానీ వారు సిబ్బంది కొరత పేరుతో పూర్తిగా తనిఖీలను మర్చిపోయారు. 16 మంది టీఏలు, ఆర్ఐలకుగాను కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. తనిఖీల విషయంలో మైనింగ్ శాఖ పూర్తిగా చేతులెత్తేసింది. వారికి లీజులు, టీపీల యజమానులు, అక్రమంగా తరలించే వారి నుంచి ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. లీజు, టీపీల నుంచి మొరం వ్యాపారులు ఒక పర్మిట్ తీసుకుని, రోజంతా టిప్పర్లలో మొరం తరలిస్తారనేది బహిరంగ రహస్యం. లీజుల్లో నుంచి ఎన్ని క్యూబిక్ మీటర్ల మొరం తరలుతుందో మైనింగ్‌శాఖ వద్ద వివరాలు లేకపోవడం విడ్డూరం.



బాల్కొండ మండలం వరద కాల్వలో..

దేశాయ్‌కి కన్నీటి వీడ్కోలు



శివరాజ్ దేశాయ్ మృతదేహం వద్ద కన్నీరు పెడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

రుద్రూర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోటగిరి మాజీ జడ్పీటీసీ, బోధన్ సీడీసీ చైర్మన్ శివరాజు దేశాయ్, ఆయన కుమారుడు రాజు దేశాయ్‌కి గురువారం అశ్రునయనాల మధ్య ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. శివరాజు దేశాయ్ కడసారి చూపు కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కోటగిరి మండలం బస్వాపూర్‌కు తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, జుక్కల్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యేలు ఎస్ గంగారాం, యెండల లక్ష్మీనారాయణలు శివరాజు దేశాయ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అంత్యక్రియలకు మాజీ జెడ్పీటీసీలు పుప్పాల శంకర్, అంబర్ సింగ్, శంకర్ పటేల్, మాజీ ఎంపీపీ గంధపు పవన్ కుమార్, ఎలమంచిలి శ్రీనివాస్ రావు, గంగాధర్ పటేల్, కొట్టం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం మాల సంఘం నూతన కమిటీ ఎన్నిక



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పిట్లం మండల మాల సంఘం నూతన కమిటీని రాష్ట్ర నాయకులు అయ్యాల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి మైసయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గైని బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇంటెనుక సాయిలు, ఉపాధ్యక్షుడిగా పంతంగి చిన్న సాయిలు, కోశాధికారిగా బేగరి శంకర్, జాయింట్ సెక్రటరీగా పంతంగి కాశీరాం, సలహాదారులుగా పోతురాజు సాయిబాబా, సతీష్, పంతంగి మైసరం, బేగరి సాయిలు, పోతురాజు లింగమయ్యలను ఎన్నుకున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

సదాశివనగర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2006–07 పదో తరగతి పూర్వ విద్యార్థులు గురువారం అపూర్వ సమ్మేళనం చేపట్టారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అంధకారంలో తాడ్వాయి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రం బుధవారం రాత్రి అంధకారమైంది. కరెంటు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తరచుగా విద్యుత్ సరఫరాలో సమస్యలు వస్తున్నాయి. అధికారులకు చెప్పినా సరిగ్గా పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు కరెంటు సరఫరా కాలేదు. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో డీఈవో రాజు ఇతర అధికారులు

కామారెడ్డి టౌన్/కామారెడ్డిరూరల్‌భిక్కనూరు/లింగంపేట: జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం జిల్లా స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో జిల్లాలోని 47 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు డీఈవో ఎస్.రాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దిరామిరెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రతినిధులు యాదగౌడ్, ప్రవీణ్ కుమార్, శ్రీశైలం, రాజ్‌కుమార్, కృష్ణాకర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆయా పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు నిరంజన్



నిరంజన్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి గిరిజన బాలుర పాఠశాల విద్యార్థి నిరంజన్ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా అండర్–14 బాలుర పోటీలకు ఎంపికైనట్లు కోచ్ నరేష్ తెలిపారు. గాంధారి మండలం పోతంగల్ కలాన్‌లో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి సెపక్ తక్రా ఎంపికల్లో నిరంజన్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కోచ్ నరేష్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు..



మాట్లాడుతున్న తిర్మల్‌గౌడ్

దోమకొండ: ఆర్చరీ పోటీలు గురువారం దోమకొండ మండల కేంద్రంలోని గడికోటలో నిర్వహించారు. పోటీల్లో 21 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా ఆర్చరీ అధ్యక్షుడు తీగల తిర్మల్ గౌడ్, ఆర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్‌లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ రెడ్డి, దోమకొండ గడికోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జీ, బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, నాయకులు పున్న లక్ష్మణ్, బుర్రి రవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎల్లారెడ్డిలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



కామారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వారు గురువారం ఎంఈవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కామారెడ్డి రూరల్: తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అలాగే పేస్కేలు అమలు చేయాలని కోరారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని అడిగారు. హామీలు నెరవేర్చకపోతే డిసెంబర్ మొదటి వారంలో సమ్మెకు వెళ్తామన్నారు. ఉద్యోగులు చిరంజీవి, మాధవి, శైలజ, భక్తమాల సారిక, రాములు, సాయిరెడ్డి రమేష్, శంకర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలి



బాన్సువాడలో మాట్లాడుతున్న నేతలు



జుక్కల్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

బాన్సువాడ: వచ్చే నెల 1న నిర్వహించే మాలల సింహగర్జన మహాసభలను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు బంగారు మైశయ్య, నర్రె నర్సింలు కోరారు. గురువారం బాన్సువాడలో వారు మాట్లాడుతూ.. సభకు మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. నేతలు ప్రశాంత్, మన్నే చిన్న సాయిలు, మన్నే నాగభూషణం, రాజు, గంగారాం, గంగాధర్, మోహన్, సాయిలు తదితరులున్నారు.

నిజాంసాగర్(జుక్కల్): మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని జుక్కల్ మండల మాల మహానాడు ప్రధాన కార్యదర్శి మిలింద్‌కాంబ్లే కోరారు. గురువారం జుక్కల్ మండల కేంద్రంలో మాలల సింహగర్జన సభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. నేతలు కాంబ్లే కిరణ్, రాజు, గజానంద్, అజయ్ తదితరులున్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

ఎల్లారెడ్డి/తాడ్వాయి: బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు మద్దతుగా దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఎల్లారెడ్డి మండల, పట్టణ అధ్యక్షులు జలందర్‌రెడ్డి, సతీష్‌లు, తాడ్వాయి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులుగం సాయిరెడ్డి, పార్టీ ప్రధాన కారదర్శి గోపాల్‌రావులు కోరారు. శుక్రవారం కామారెడ్డిలో నిర్వహించే దీక్షా దివస్‌కు ఎంఎల్‌సీ కవిత, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు.. ఒకరికి గాయాలు



గాయపడిన ప్యాలాల్

వర్ని: మండలంలోని జలాల్‌పూర్ శివారులో బైక్‌ను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పులిక్యాంప్ గ్రామానికి చెందిన ప్యాలాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పులిక్యాంప్‌నకు చెందిన ప్యాలాల్ గురువారం జలాల్‌పూర్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా బడా పహాడ్ నుంచి జలాల్‌పూర్ వైపు వస్తున్న నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొన్నది. ప్రమాదంలో బాధితుడికి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. వర్ని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

రామారెడ్డి: బాలికను ప్రేమించి, పెళ్లిచేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన మరుకంటి రాజ్‌కుమార్ ఓ బాలికను ఏడాది నుంచి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. మైనర్ బాలిక ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంజీవరెడ్డి కాలనీలో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగవ టౌన్ పీఎస్ పరిధిలోని సంజీవరెడ్డికాలనీలో శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు గంగస్థాన్ ఫేస్–2 కు ఉదయం 10:30 గంటల ప్రాంతంలో వెళ్లి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువాను ధ్వంసం చేసి ఆరు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత



ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలో కిలో వంద గ్రాముల ఎండు గంజాయి పట్టుబడినట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. సీఐ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి వద్ద ఉదయం 11 గంటలకు వాహనాల తనిఖీ చేస్తుండగా పెర్కిట్‌కు చెందిన మహ్మద్ వాహిద్ అనే వ్యక్తి వద్ద కిలో వంద గ్రాముల ఎండు గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుడు మహారాష్ట్ర నుంచి గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గంజాయి, బైక్, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. తనిఖీలో సిబ్బంది చంద్రమౌళి, సందీప్, శ్రీనివాస్, సాగర్, గంగాధర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నిజాంసాగర్: మండల శివారులోని బంజేపల్లిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్

తొగరి కాయ కోసం వెళ్లి మృత్యు ఒడికి..

- పొలానికి వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి
- రెండు కుటుంబాల్లో విషాదఛాయలు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నరేశ్



మేకల వంశీ(ఫైల్)



మేకల కార్తీక్(ఫైల్)

బిచ్కుంద: చేనులో కాసిన తొగరి కాయ కోసం వెళ్లిన ఇద్దరి యువకులను మృత్యువు కబళించింది. రోడ్డు ప్రమాదంలో వారిని కాటేసి ఇరు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. బిచ్కుంద మండలంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నాదమ్ముళ్లు మృతి చెందారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. బిచ్కుంద మండలం పెద్ద తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన మేకల కార్తిక్(25), మేకల వంశి(20) అనే ఇద్దరు ఒకే కుటుంబానికి చెందిన చిన్ననాన్న, పెద్ద నాన్న అన్నాదమ్ముళ్లు. కార్తిక్‌కు 9 నెలల క్రితం వివాహం కాగా భార్య గర్భిణిగా ఉంది. తనకున్న వ్యవసాయ భూములను కౌలుకు ఇచ్చి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. పిట్లంలో ఇటీవల బంధువుల పెళ్లి కోసమని ఇంటికి వచ్చాడు. మేకల వంశీ కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామంలోనే వ్యవసాయ పనులు చేస్తున్నాడు. కార్తిక్, వంశీ గురువారం సాయంత్రం తమ పొలానికి కాసిన తొగరిని తెంపేందుకు బైక్‌పై చేనుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా కౌలాస్‌గేట్ ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో వీరు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఐ నరేశ్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు జుక్కల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సాయిబాబా(ఫైల్)

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని కొనతండా వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పిట్ల సాయిబాబా(30) అనే వ్యక్తి మృతి చెందాడు. గాలిపూర్ గ్రామానికి చెందిన సాయిబాబా స్కూటీపై కొత్తబాదికి వెళ్తున్నాడు. బాన్సువాడ–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున స్కూటీని ఏదైనా వాహనం ఢీ కొన్నదా లేదా వాహనం పల్టీ కొట్టి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడ అన్న విషయం తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.